సాక్షి
నంద్యాల
గురువారం । 30 । జనవరి । 2025



అన్న ప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం ఒంగోలుకు చెందిన రామయ్య రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందించారు.



వీరభద్రుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: బయలు వీరభద్రస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా విశేషార్చన జరిపించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా పూజలో పాల్గొన్నారు.



ఆధార్ కార్డు కోసం వచ్చి...

ఎమ్మిగనూరు – ఆదోని రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం చెందారు. ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

మార్మోగుతున్న గోవింద నామస్మరణ



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాల్లో గోవింద నామస్మరణ మార్మోగుతోంది. ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి పల్లకీలో కొలువై గ్రామ గ్రామానికి వెళ్లి తెలుపుల మీద కొలువు దీరగా ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. బుధవారం పల్లకీ ముత్తలూరు నుంచి నల్లవాగుపల్లెకు చేరుకోగా ఆ గ్రామ పెద్దలు మేళ తాళాలతో ఎదురెళ్లి స్వాగతం పలికారు. తర్వాత పల్లకీ అక్కడి నుంచి ఆళ్లగడ్డ మండలం బాచాపురానికి చేరుకుంది.

వీబీఆర్‌లో చేప పిల్లల విడుదల



వీబీఆర్‌లో చేప పిల్లలు విడుదల చేస్తున్న జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో బుధవారం 5 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వాటిని విడుదల చేశామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 40% సబ్సిడీ తో చేప పిల్లలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి పామన్న, భరత్ లాల్ నాయక్, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ నవీన్, నాయకులు అన్నారపు శేషి రెడ్డి, అబ్దుల్ కలాం, శంకర్ రెడ్డి, మత్స్య సహాయకులు ఉదయ్, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నుంచి 14,300 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం ద్వారా మంగళవారం నుంచి బుధవారం వరకు దిగువ ప్రాజెక్టులకు 14,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 4.021 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 7,770 క్యూసెక్కుల నీటిని వదిలారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,630, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 7,361 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.బుధవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 88.6777 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 853.80 అడుగులకు చేరుకుంది.

సుగ్గి బాటలో మృత్యు గీతం

జిల్లా పశ్చిమ ప్రాంతం కరువుకు కేరాఫ్. ఉపాధి కరువై ఏటా రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలు ఇక్కడ వలస వెళ్తూనే ఉన్నాయి. వెనుకబడిన ఈ ప్రాంతంలో సుగ్గి ఓ భాగం. వానాకాలం ముగిసిన వెంటనే అందరూ పొట్ట చేతబట్టుకుని పొరుగూళ్లకు ప్రయాణం ఖాయం. ఆ బతుకు బాటలో చావు కేకలు వినిపిస్తున్నాయి. చివరికి సుగ్గి కుటుంబాల్లో కన్నీటి గాథలు మిగులుతున్నాయి. వలస వెళ్లిన ఎంతో మంది కూలీలు ప్రమాదాల బారిన పడి మృత్యుఒడి చేరుతున్నారు. బతుకులు బుగ్గి అవుతున్నా వలసలు ఆగడం లేదు.



- ప్రమాదాల బారిన వలస కూలీలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- వలసల నివారణలో అధికారుల వైఫల్యం
- మృతుల కుటుంబాలను ఆదుకోని ప్రభుత్వం

మంత్రాలయం: జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు తుంగభద్ర దిగువ కాలువ నీరు ప్రధాన సాగునీరు. తర్వాత మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో గురురాఘవేంద్రప్రాజెక్టు ఎత్తిపోతల పథకం, గాజులదిన్నె ప్రాజెక్టులే సాగునీటి వనరులు. పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీనీవా జలాల ఆధారిత చెరువులపై ఆధారపడి సాగు సాగుతోంది. సాగునీటి వనరులు కొరతతో ఎక్కువగా వర్షాధార పంటలు సాగు చేయాల్సి వస్తోంది. వానకాలం ముగిసిన వెంటనే ఇక్కడ వేలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు వలస వెళ్లడం జరుగుతోంది. ఆయా నియోజకవర్గాల నుంచి దాదాపు 42 వేల కుటుంబాలకుపైగా వలస వెళ్లినట్లు అంచనా. ఒక్క మంత్రాలయం నుంచే 13 వేల కుటుంబాలు వలస వెళ్లినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ వలస సంఖ్య అమాంతంగా పెరిగిపోయింది. నగదు బదిలీ పథకాలు కొరవడటం, రైతు పోత్సాహకాలు లేకపోవడంతో సుగ్గిబాటలో తరలిపోతున్నారు. వలస వెళ్లిన కుటుంబ సభ్యులను కోల్పోయి ఆదుకునేందుకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఒక్క గ్రామీణ ఉపాధి హామీ పథకం తప్ప ఇక్కడి వలస జీవులకు ఆధారం లేకపోయింది. ఉపాధి వేతనం సైతం అరకొరగా వస్తుండటంతో కూలీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వలస నివారణకు ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పడం, వృత్తి కళలపై ఆసక్తి పెంచడం, ఇతర కుటీర పరిశ్రమలకు సహాయ సహకారాలు అందించడం చేయాలి. అంతేగాక ఆర్డీఎస్ కుడి గట్టుకాలువ, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులు నిర్మాణం జరగాలని, గురురాఘవేంద్రప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల్లో ఆయకట్టు స్థిరీకరించాలని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..

కోసిగి మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన ఈడిగ గిడ్డయ్య(28)కు భార్య లక్ష్మి, కూతుళ్లు అనురాధ, అక్షిత, కొడుకు యువరాజు ఉన్నారు. ఆ కుటుంబానికి ఎకరా మెట్ట పొలం ఉంది. తోడబుట్టిన తమ్ముళ్లకు పొలాన్ని కౌలుకు ఇచ్చి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. ఆటో రిపేరి రావడంతో, కుటుంబ పోషణ భారమైంది. అప్పటికే సేద్యానికి, పోషణకు రూ.3 లక్షలకుపైగా అప్పు కావడంతో ఇంటిల్లిపాదిని తీసుకుని సుగ్గికి వెళ్లాడు. తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గం నాచర్ల గ్రామానికి పత్తి తీయడానికి వెళ్లారు. గతేడాది డిసెంబర్ 10వ తేదీన పిల్లల పాలు, బిస్కెట్ల కోసం గిడ్డయ్య బజారుకు వెళ్లి వస్తుండగా



గిడ్డయ్య భార్య లక్ష్మి, సంతానం

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఇంటి పెద్దదిక్కు కాలం కావడంతో లక్ష్మి దిక్కులు చూస్తోంది. పిల్లల పోషణ కోసం ఊరిలోనే రోజూవారి కూలీకి వెళ్తోంది. అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక కన్నీళ్లు పెట్టుకుంటోంది.

బిడ్డ దూరమై..



ఆదిలక్ష్మి

ఎమ్మిగనూరు మండలం కనకవీడు గ్రామానికి చెందిన వడ్డె వీరశేఖర్, రామలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఆదిలక్ష్మి, మహేశ్వరి, కుమారుడు పరశురాముడు ఉన్నారు. గతేడాది పిల్లలతోపాటు తెలంగాణలోని జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌కు వెళ్లారు. సీడ్ పత్తి పనులకు వెళ్లారు. శ్రావణమాసం కావడంతో వడ్డె వీరశేఖర్, రామలక్ష్మి స్వగ్రామం వచ్చారు. అక్కడే ఆదిలక్ష్మిని పనికి వదిలేసి వచ్చారు. గతేడాది ఆగస్టు 20వ తేదీ సాయంత్రం ఆదిలక్ష్మి (15) పొలం పనిచేస్తుండగా పిడుగుపాటుకు గురైంది. పిడుగు పడటంతో ప్రాణాలు వదిలింది. పెద్ద కూతురు మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అయినా వారు ప్రస్తుతం ఇద్దరు పిల్లలతో తెలంగాణలోనే పత్తి పనులకు వలస వెళ్లారు.

‘కూలిన’ కుటుంబ బతుకు..



పెద్ద ఆంజనేయులు భార్య సరస్వతి, కుమారుడు



పెద్ద ఆంజనేయులు

మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన మద్రాసు పెద్ద ఆంజనేయులు (29)కు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు అరుణ్, అరవింద్ ఉన్నారు. ఆ కుటుంబానికి ఎకరా బయలు భూమి ఉంది. ఈ ఏడాది పొలం పనులు ముగించుకుని భార్యా పిల్లలతో అనంతపురం జిల్లా కేంద్రానికి వలస వెళ్లాడు. అక్కడ సెంట్రింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. రోజూ మాదిరిగానే గతేడాది సెప్టెంబర్ 27వ తేదీన రెండు అంతస్తుల భవనానికి సెంట్రింగ్ పని చేసేందుకు వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో సెంట్రింగ్ కర్రలపై బ్యాలెన్స్ తప్పి కింద పడ్డాడు. తీవ్ర రక్త గాయాలు కావడంతో అక్కడే ప్రాణాలు వదిలాడు. సుగ్గి వెళ్లిన చోటే భర్త ప్రాణాలు వదలడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. పిల్లల పోషణ కోసం ఇప్పుడు కూడా ఆమె భర్త తరుపు కుటుంబ సభ్యులతోనే అనంతపురంలో సిమెంట్ పనికి వెళ్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో సరస్వతి దిక్కుతోచని స్థితిలో కాలం వెల్లదీస్తోంది.

ఆరిన ఇంటి దీపం..



యంకమ్మ ఆరుగురి సంతానం



యంకమ్మ

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన నక్కల రవి, యంకమ్మ దంపతుల జీవన ఆధారం వ్యవసాయం. నాలుగు ఎకరాలు ఉన్నా కలిసిరాక అప్పుల పాలయ్యారు. అప్పులు తీర్చుకునేందుకు సుగ్గి బాట ఎంచుకున్నారు. గతేడాది నవంబర్ నెలలో తమ ఆరుగురు కూతుళ్లను వెంట వేసుకుని తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా ఉప్పలపల్లి మండలం తాటిపల్లె గ్రామానికి వెళ్లారు. గతేగాది నవంబర్ 3 తేదీన.. రోజూ మాదిరే పత్తి పనులకు వెళ్లారు. అయితే నక్కల యంకమ్మ(30)కు జ్వరం రావడంతో పత్తి పంటలో మొక్కల నీడ చాటున సేద తీరింది. అదే సమయంలో కోత ముగిసిన పత్తి పైరు తొలగించేందుకు పొలం రైతు ట్రాక్టర్‌తో దుక్కి చేసుకుంటూ వచ్చాడు. ఒక్కసారిగా నిద్రిస్తున్న నక్కల యంకమ్మపై ట్రాక్టర్ ఎక్కడంతో ప్రాణం పోయింది. ఆరుగురు కూతుళ్ల (అనిత, రాణి, గంగమ్మ, కమల, నరసమ్మ, చిన్ని) తల్లిలేని పిల్లలు అయ్యారు. కూతుళ్లను చూసుకునేందుకు తండ్రి రవి కష్టాలు పడుతున్నాడు.

మరికొన్ని సంఘటనలు..

- గతేడాది మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన కౌతాళం మారయ్య(50) కుటుంబ సభ్యులతో గుంటూరులో మిరప పనులకు వెళ్లాడు. పని చేస్తుండగా అనుకోకుండా ఆయనకు గుండెపోటు రాగా మృత్యువాత పడ్డాడు.
- ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన పెద్ద అయ్యప్ప, లింగమ్మతో కలిసి చిన్న కుమారుడు శివ (14) అనంతపురం జిల్లా కేంద్రానికి వలస వెళ్లారు. వలస వెళ్లడం ఇష్టం లేక పోవడంతో అక్కడే బాత్ రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణం పొందాడు. గతేడాది డిసెంబర్ 23న ఈ ఘటన చోటు చేసుకుంది.
- కౌతాళం మండలం గుడికంబాళికి చెందిన వడ్డె బొజ్జమ్మ, నాగేష్ చిన్నకుమారుడు అంజినయ్య (18) గ్రామస్తులతో కలిసి తాపీ మేస్త్రీ పనికి వెళ్లాడు. గతేడాది ఆగస్టు 24న ఓ అంతస్తుపైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. గారాల చిన్న కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా శ్రీశైలం

- కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి విద్యావతి



శ్రీశైలంలో అధికారులతో సమావేశమై చర్చిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి విద్యావతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం సంకల్పించిందని కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ కార్యదర్శి ఎ.విద్యావతి తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో విద్యావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి, నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు. శ్రీశైల యాత్రకు వచ్చిన పర్యాటకులు శ్రీశైలంలోనే నాలుగు రోజుల పాటు బస చేసి, ఇక్కడి పర్యాటక ప్రదేశాలను సందర్శించుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై ఈ సమావేశంలో చర్చించారు. శ్రీశైలంలో స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు, పరిసర ప్రాంతాలైన శ్రీశైలం డ్యాం, స్పిల్‌వే గురించి వివరించడం, జంగిల్ సఫారీ, టైగర్ సఫారీ, చిన్నపిల్లల కోసం అమెజింగ్ పార్క్‌లపె ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. క్షేత్ర పరిధిలో ప్రస్తుతం ఆటోలు, సైట్ సీయింగ్ జీపుల వారికి ఏమైనా గుర్తింపు కార్డులు ఉన్నాయా, ఎంత చార్జీలు వసూలు చేస్తున్నారు అనే విషయాలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా శ్రీశైలం, ద్వారకా, ఖజురహో ప్రదేశాలను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ సమావేశంలో పర్యాటకులకు ప్రస్తుతం అందుతున్న సేవలు, మెరుగైన పర్యాటక సేవల గురించి పూర్తి స్థాయిలో చర్చించామని అన్నారు. మరో 8 ఎనిమిది నెలల్లో మూడు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ఆయా సమస్యలను పరిష్కరించడానికి కార్యచరణ, ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు.

పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు వాసుబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు కోర్టుల పరిధిలో పారా లీగల్ వలంటీర్ల నియామకం చేపడుతున్నట్లు వెల్లడించారు. కనీస విద్యార్హత పదవ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. జిల్లాకు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా కోర్టుల పరిధిలోని మండల లీగల్‌సెల్ కార్యాలయాల్లో ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్‌రాజకుమారి

నంద్యాల: జిల్లాలో పూర్తిస్థాయిలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. అడిషనల్ ఎస్పీ మంద జావలి అల్ఫోన్సా, డీఆర్‌ఓ రాము నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో డి అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 1957 పాఠశాలలు, 49 కళాశాలలు, 196 ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాసంస్థల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై చైతన్య పరచాలన్నారు. జిల్లాలోని పలు ఫ్యాక్టరీల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు పని చేస్తున్నారని, వారు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్యాక్టరీల యజమానులు తనిఖీలు కూడా చేయాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్‌షాపుల్లో నిద్ర మాత్రలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మల్బరీ, బంతిపూలు, మిర్చి తదితర పంటల సాగులో గంజాయి పండించే ప్రమాదం ఉందని, పరిశీలించాలని చెప్పారు. శివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని శైవ క్షేత్రాల్లో సాధువులు, స్వాములు మాదకద్రవ్యాలు వినియోగించే అవకాశం ఉందని, కట్టడికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వాటి రవాణా జరగకుండా నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు విశ్వనాథ్, నాగజ్యోతి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- ఓట్ల కోసం సూపర్‌సిక్స్ పేరుతో హామీలు
- అధికారంలోకి వచ్చాక హామీలు లేవు.. అభివృద్ధి లేదు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజం
- ప్రజల తరఫున హామీల అమలుకు పోరాటం చేస్తామని వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

కల్లూరు: ఓట్లు, అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు దిట్ట అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం కాటసాని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు నమ్మించారన్నారు. నేటికీ ఏడు నెలలు గడిచినా అతీగతీ లేదన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చేటప్పుడు బాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే చంద్రబాబు రూ. 1.19 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చారన్నారు. అంత డబ్బుతో రాష్ట్రంలో ఎక్కడ సంపద సృష్టించారో? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్న ఘనత బాబుదన్నారు. వలంటీర్లు, బెవరేజెస్ కార్పొరేషన్, ఫైబర్ నెట్ కార్పొరేషన్, ఏపీఎండీసీ, కొన్ని చోట్ల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తీసేశారని, ఇప్పుడు గ్రామ/వార్డు సచివాలయాల్లో హేతుబద్ధీకరణ పేరుతో ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టినట్టేనని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన మాటలు నేడు నిజమయ్యాయన్నారు.

రీ సర్వేపై దుష్ప్రచారం

ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ భూములను లాక్కుంటున్నారని రీసర్వేపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ఆ సర్వేను పునఃప్రారంభించారన్నారు. ఇలా ప్రతి విషయంలో ఎన్నికల ముందు ఒకమాట అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం బాబు నైజమన్నారు. ఆయన మాట మీద నిలబడే వ్యక్తి కాదని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి, పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు హనుమంతురెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, గోపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఈశ్వరయ్య, తిరుపాల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాడు ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఇంటి వద్దకు తీసుకెళ్లామని కాటసాని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న సమయంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ఎంతో మంది పేద విద్యార్థులు డాక్టర్ విద్య అభ్యసించే అవకాశం వచ్చేదన్నారు. ఇసుక, మద్యం, క్వార్ట్జ్, ఫ్లైయాష్ దేని వదలకుండా కూటమి నేతలు దోచుకుంటున్నాని విమర్శించారు. నియోజకవర్గాల్లో ప్రతి పనికి ఎమ్మెల్యేలకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. సంపద సృష్టి అధికారపార్టీ వాళ్లకు తప్ప ఎవ్వరికి జరగడం లేదన్నారు. పాణ్యం నియోజకవర్గంలో వాటాల కోసం కూటమి నేతలు కొట్టుకున్న సంఘటనలున్నాయన్నారు.

క్లుప్తంగా

సౌత్‌జోన్ వుడ్ బాల్ విజేతగా ఆంధ్రప్రదేశ్ జట్టు



విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న ఆంధ్రప్రదేశ్ వుడ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్) : సౌత్‌జోన్ వుడ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ వుడ్‌బాల్ పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విన్నర్స్‌గా, తమిళనాడు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. హార్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ వినోద్ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల ఒత్తిడి తగ్గి మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలను దైనందిన జీవితంలో ఎంచుకోవాలన్నారు. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్, పద్మావతి, శివరాజు, అసోసియేషన్ కార్యదర్శి ప్రభాకర్, రెహిమాన్ పాల్గొన్నారు.

టెక్నికల్ అధికారిగా పరుశురాముడు



నంద్యాల(న్యూటౌన్): ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలకు టెక్నిక్ అధికారిగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పరుశురాముడు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉన్నారు. గతేడాది నిర్వహించిన మొదటి వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలకు భారత జట్టు మేనేజర్‌గా వ్యవహరించారు. తాజాగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నేపాల్‌లో జరిగే రెండో ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలకు తనను టెక్నికల్ అధికారిగా నియమిస్తూ షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్‌తోమర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పరుశురాముడు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

నాటుసారా స్థావరంపై దాడి



బెల్లం ఊటను పారవేస్తున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని నాగలూటి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న నాటు సారా స్థావరంపై బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కిశోర్‌కుమార్ దాడి చేశారు. సారాకు సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

రోడ్డు పక్కన బతుకు వేదన



వంట చేసుకుంటూ..

ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కొన్ని కుటుంబాలు బతుకుదెరువు కోసం వందల కిలోమీటర్లు దాటి కర్నూలు నగరానికి వచ్చాయి. మెడికల్ కాలేజ్, సీ క్యాంపు, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు సిటీలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన విక్రయాలు సాగిస్తున్నాయి. బొలెరో వాహనమే వారికి ఇళ్లు, గోడౌన్. రోడ్డే పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో వంట చేసుకుని ఆరగిస్తుంటారు. వీరంతా 40 నుంచి 50 మంది వరకు ఒక బృందంగా ఉంటారు. వ్యాపారాలు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

– డి. హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్



వ్యాపారిని పట్టించుకోని నగర వాసులు



చిన్న పిల్లల వస్తువులను పరిశీలిస్తూ..



విక్రయానికి ఉంచిన మినీ అక్వేరియంలను చూస్తూ...



వంట సామగ్రిని విక్రయానికి ఉంచి...



కొనుగోళ్లు లేక వ్యాపారం వెలవెల

పోక్సో కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన శ్రీరాములు అనే వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ బుధవారం తెలిపారు. కొండ ప్రాంతంలో పనులకు వెళ్లిన 11 ఏళ్ల బాలికపై శ్రీరాములు అత్యాచారానికి యత్నించాడన్నారు. అయితే ఆ బాలిక కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకోవడం చూసి పరారయ్యాడన్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఇంటిగ్రేటెడ్' ప్రాజెక్టుపై సర్వే

కర్నూలు సిటీ: ఇంటిగ్రేటెడ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వేపై కర్నూలు ప్రాజెక్ట్సు సీఈ కబీర్ బాషా, కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి, డీఈఈ కిష్టన్న బుధవారం పందికోన రిజర్వాయర్ వద్ద చర్చించారు. మ్యాప్‌లను పరిశీలించి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ప్రాజెక్టుపై అధ్యయనం చేసిన తర్వాత పీఎంకేఎస్‌వై కింద సుమారుగా రూ.900 కోట్లకు ప్రతిపాదనలు చేసే యోచనలో ఇంజినీర్లు ఉన్నారు.

ఇదీ ప్రాజెక్టు..

కర్నూలు జిల్లా పశ్చిమ పల్లెలు కరువు కోరల్లో చిక్కుకున్నాయి. ఈ ప్రాంతంలో వలసలు ఎక్కువ ఉండటంతో మైక్రో ఇరిగేషన్ ద్వారా సాగు నీటిని అందిస్తామని గతంలో తెలుగు దేశం పార్టీ నాయకులు హామీలు ఇచ్చారు. ఇంత వరకు అమలుకాకపోవడంతో మరోసారి ఈ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. పందికోన రిజర్వాయర్ నుంచి ఇంటిగ్రేడేట్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టాలనేది లక్ష్యం. ఈ ప్రాజెక్టు పూర్తయితే పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లో 27 వేల ఎకరాలకు సాగు నీరు, అలాగే 16 గ్రామాలకు తాగు నీరు అందనుంది.

రైతు దంపతులకు కేంద్రమంత్రి అభినందన

● న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సూక్ష్మ సేద్య స్టాల్ ప్రదర్శన



ఢిల్లీలో రైతు చంద్రశేఖర్‌గౌడు దంపతులు ఏర్పాటు చేసిన స్టాల్

కర్నూలు(అగ్రికల్చర్): న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగిన గణతంత్ర వేడకల్లో కృష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన రైతు యు. చంద్రశేఖర్‌గౌడు దంపతులు సూక్ష్మ సేద్య స్టాల్‌ను ప్రదర్శించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రైతు ముఖాముఖిగా మాట్లాడారు. సూక్ష్మ సేద్యంతో సాధించిన ప్రగతిని వివరించారు. తాము వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్య సదుపాయం పొంది దానిమ్మ, అరటి, చీనీ తదితర పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. రైతు దంపతులను కేంద్రమంత్రి అభినందించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి ఒక్కో రైతు కుటుంబాన్ని ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా నుంచి చంద్రశేఖర్‌గౌడు దంపతులకు ఆహ్వానం లభించింది. రాష్ట్రం నుంచి న్యూఢిల్లీ వెళ్లిన ఏడు కుటుంబాలకు కర్నూలు ఏపీఎంఐపీ ఆదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరించారు. దేశ రాజధానిలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న చంద్రశేఖర్‌గౌడు దంపతులను ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి అభినందించారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

● మైనార్టీ ఆఫైర్స్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్

కర్నూలు(సెంట్రల్): విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మైనార్టీ ఆఫైర్స్ ఎంఏ షరీఫ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం సంతోషనగర్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కర్నూలు రూరల్ మండలం పంచలింగాలలోని ఏపీ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఆయన కలెక్టర్ పి.రంజిబాషాతో కలసి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యతోనే మనిషి నాగరికతతోపాటు సంపూర్ణమైన జీవితం ఆవిష్కృతమవుతుందని, పేదరికంలో ఉన్న వారు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలనిసూచించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తుంటారని, వారి కలలను నిజం చేసేందుకునిరంతరం కృషి చేయాలనిసూచించారు. సంతోషనగర్ పాఠశాల ప్రహరీ, డైనింగ్ హాల్ వసతులను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.



సంతోషనగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో మొక్క నాటుతున్న ఎంఏ షరీఫ్

కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ, బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మైనార్టీ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, డీఎస్పీ మహబూబ్‌బాషా, మైనార్టీ సంక్షేమ అధికారిసబిహా పర్వీన్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆటో, బైక్‌ను ఢీ కొట్టిన కారు

● ఆరుగురికి గాయాలు



గాయపడిన నాగరాజు, కమలనాథ్ నుంచి వివరాలు సేకరిస్తున్న రూరల్ పోలీసు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో ఆటో, బైక్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో చికిత్స కోసం ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి చెందిన నాగరాజుతో పాటు మరికొంత మంది బుధవారం ఆటోలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్నారు. వీరు వెళ్తున్న ఆటోను ఆదోని వైపు నుంచి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి వెనుకనుంచి ఢీ కొట్టింది. ఆటో బోల్తాపడి, పల్టీ కొట్టడంతో అందులో ఉన్న కమలనాథ్, నాగరాజు, నీలకంఠ, పద్మ, గిరిలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆటోను ఢీ కొట్టిన కారు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టడంతో హనుమాపురం గ్రామానికి చెందిన పరమేష్ అనే యవకుడి కాలుకు తీవ్ర గాయమై 14 కుట్లు పడినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును, గాయపడ్డ వారికి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మహానంది: ఆటో నడుపుతూ జీవనం సాగించే తన భర్త అల్తాఫ్ గత రెండు నెలల నుంచి కనిపించడం లేదని బుధవారం గాజులపల్లెకు చెందిన మహిళ ఫర్జాన పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతేడాది నవంబర్ 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, తెలిసిన బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొంది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమాలు 'డబుల్'

● రైతులు తెచ్చిన పత్తి వాహనాలకు డబుల్ కాటా

● దాదాపు రూ.80 లక్షలు స్వాహా

ఆదోని అర్బన్: పత్తి దిగుబడులు తీసుకురాకున్నా వాహనం వచ్చినట్లు వేబ్రిడ్జిలో డబుల్ కాటా స్లిప్‌లు తీసి అక్రమాలకు పాల్పడ్డారు. రైతుతో వేలి ముద్ర వేయించారు. డబ్బు రైతు అకౌంట్‌లో పడగానే కలిసి పంచుకుంటున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదోని పట్టణంలో ఆరు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఐదు పరిశ్రమలు మాత్రమే రైతులు తెచ్చిన పత్తి దిగుబడులకు గిట్టుబాటు ధర వేసి సీసీఐ నుంచి కొనుగోలు చేసుకుంటోంది. ఒక్కొక్క పరిశ్రమలో 6 వేల నుంచి 18 వేల వరకు దూదిబేడలను జిన్నింగ్ చేసి ప్రెస్సింగ్ చేసింది. అయితే ఓ ఫ్యాక్టరీలో గుమస్తా, సీసీఐకు సంబంధించిన నలుగురు కాంట్రాక్ట్ గుమస్తాలు, ఒక సూపర్‌వైజర్ బయట బ్రోకర్లతో



పరిశ్రమల్లో జిన్నింగ్ ప్రెస్సింగ్ వచ్చిన దూదిబేళ్లు(ఫైల్)

చేతులు కలిపి అక్రమాలకు పాల్పడ్డారు. రోజుకు మూడు నుంచి ఐదు వాహనాలను సరుకు లేకుండా వేరే రైతు తెచ్చిన పత్తి దిగుబడులకు డబుల్ కాటా వేస్తారు. ఇలా రూ.80 లక్షలు పైన దోపిడీ చేసినట్లు తెలిసినా సీసీఐ నిర్వాహకులు పట్టనట్లు ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై సీసీఐ నిర్వాహకుడు భరత్ మాట్లాడుతూ.. ఓ ఫ్యాక్టరీలో వెయ్యి క్వింటాళ్లపైనే దోపిడీ జరిగిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి, తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు హాజరయ్యారు. కోర్టుకు అభ్యర్థన చేసుకుని అర్హత పొందిన రాష్ట్రంలోని పలు జిల్లాల వారీగా వచ్చిన హోంగార్డు అభ్యర్థులకు కూడా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం 18వ రోజు 209 మంది పురుష, మహిళా హోంగార్డు అభ్యర్థులు హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్స్ టెస్టులు నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో 65 మంది అభ్యర్థులు ప్రతిభ



దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన హోంగార్డు అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న నిర్వాహకులు

కనపరచి ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో పాటు సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్‌ల పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగాయి.

భార్య కాపురానికి రాలేదని..

పెద్దకడబూరు: భార్య కాపురానికి రాలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దకడబూరు గ్రామానికి చెందిన తంబలి ఈరమ్మ కుమారుడు రంగస్వామి(35) కర్ణాటక రాష్ట్రం ఎరిగేరి గ్రామానికి చెందిన రాధికతో పెళ్లి అయ్యింది. వీరికి ఒక కూతురు ఉంది. సంసారం సాఫీగా సాగుతున్న వారి మధ్యన గొడవలు వచ్చి గత సంవత్సరానికి పైగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు పంచాయితీ చేసినా ఇరువురిలో మార్పు రాలేదు. దీంతోపాటు రంగస్వామి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన అతను బుధవారం తెల్లవారిజామున ఎల్‌ఎల్‌సీ దగ్గర ఉన్న పొలం దగ్గరకు పోయి చెట్టుకు ఉరేసుకున్నాడు. తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

ఆధార్ కోసం వచ్చి.. అనంతలోకాలకు

● ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ – తండ్రీ, కుమారుల దుర్మరణం



మృతి చెందిన తండ్రి సామేల్, కుమారుడు గౌతమ్, గాయపడ్డ శాంతి

ఎమ్మిగనూరురూరల్: కర్నూలు – ఆదోని రహదారిపై బోడబండ బస్‌స్టాప్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు మండలం కోటేకల్‌కు చెందిన సామేల్(25)కు, భార్య శాంతి, కుమార్తెలు స్వాతి, ఇందు, కుమారుడు గౌతమ్(2)లు ఉన్నారు. ఆరు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

నెలలుగా ఆదోని సమీపంలోని చిన్న పెండేకల్లులోని తన బంధువుల దగ్గర ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటున్నారు. కుమారుడు గౌతమ్‌కు ఆధార్ కార్డు నమోదు చేయించుకునేందుకు బుధవారం ఎమ్మిగనూరుకు చేరుకున్నారు. పని చేసుకుని సాయంత్రం చిన్న పెండేకల్లుకు బైక్‌పై కుమారుడు, భార్యతో కలిసి బయలుదేరారు. మార్గంమధ్యలో బోడబండ బస్‌స్టాప్ సమీపంలో మంత్రాలయానికి వస్తున్న పలమనేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సామేల్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన భార్య శాంతి, కుమారుడు గౌతమ్(2)ను 108లో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో గౌతమ్ ప్రాణాలు విడిచాడు. శాంతిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు చెప్పారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణ డిగ్రీ కాలేజ్ మైదానంలో 28వ జూనియర్ నేషనల్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. స్పోర్ట్స్‌లో రాణించే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఐశ్వర్యారెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, సెపక్ తక్రా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

మహానంది: క్రీడలు శారీరక సామర్థ్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ (డీఎస్‌ఏ) డాక్టర్ జి.కరుణ సాగర్ పేర్కొన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో బుధవారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ మాట్లాడుతూ ప్రతి క్రీడలో సవాళ్లు ఉంటాయని, విజయం, ఓటమి రెండూ జీవితంలో ఎన్నో అంశాలను నేర్పిస్తాయన్నారు. క్రీడల్లో తరచూ పాల్గొనడం ద్వారా పోటీతత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయన్నారు. రాష్ట్రంలోని 20 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వీర జయలక్ష్మి, పాలిటెక్నిక్ కాలేజీల డైరెక్టర్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు, మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్‌రెడ్డి, ఓఎస్ఐ డాక్టర్ ఎల్.విజయభాస్కర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగ అరెస్టు

నందికొట్కూరు: బోరుబావుల వద్ద కరెంట్ మోటార్లను, వైర్లను చోరీ చేసే దొంగను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ సుబ్రమణ్యం బుధవారం ఎస్ఐ తిరుపాల్‌తో కలిసి బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గత కొద్ది రోజులుగా దామగట్ల, 10 బొల్లవరం గ్రామాల పొలిమేరలో బోరుబావుల వద్ద మోటార్లను దొంగలిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీంతో నిఘా వేసి చెంచు వెంకటరాముడును అరెస్టు చేశామని, చెంచు సుంకన్న అనే మరో దొంగ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మోటార్లు, వైర్లను చూపిస్తున్న పోలీసు అధికారులు

దొంగ నుంచి మూడు కరెంట్ మోటార్లు, వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి



రుద్రవరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

రుద్రవరం: ప్రతి విద్యార్థి బాగా చదివి పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించాని డీఈఓ జనార్దన్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రమైన రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరీ జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువుపై ఆరా తీశారు. స్టడీ అవర్లు సాగుతున్నాయా, ఉపాధ్యాయులు అర్థవంతంగా చదువు చెబుతున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన వెంట హెచ్ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీ రామయ్య తదితరులు ఉన్నారు.